క్లుప్తంగా

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి



జిల్లా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మాజీ సైనికుల సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కింతాడి వెంకట్రావు కమ్యూనిటీ హాల్‌లో శనివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కేజీ విక్టర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రామారావు, ప్రధాన కార్యదర్శిగా డీకె వరప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా త్రినాథ్, సంయుక్త కార్యదర్శిగా శ్రీరాములు, కోశాధికారిగా వేణుగోపాల్, సంయుక్త కోశాధికారిగా బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడి నగేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విక్టర్ మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. మాజీ సైనికులకు పక్కా ఇళ్లు ఇవ్వాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యం అత్యంత అవసరం



చేయూత సంస్థ అధినేత రవిని సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సత్యస్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. స్థానిక రోటరీహాల్లో శనివారం జరిగిన రోటరీగోల్డెన్ జుబ్లీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇటీవల ఏషియన్ వేదిక కల్చరల్ యూనివర్సిటీ సామాజిక సేవా రంగంలో ప్రకటించిన గౌరవ డాక్టరేట్ స్వీకరించిన చేయూత సంస్థ అధినేత రవిని సత్కరించారు. క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్, కార్యదర్శి ఆదిత్య, పాల్గొన్నారు.

టెన్త్‌లో ఫలితాలపై తల్లిదండ్రులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి. చిత్రంలో డీఈఓ అన్నపూర్ణ తదితరులు

కాకినాడ రూరల్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాఠశాల విద్యాశాఖ జోన్–2 ఆర్జేడీ నాగమణి శనివారం సమావేశం నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు తీసుకోవలసిన చర్యలపై పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె అవగాహన కల్పించారు. అనంతరం తల్లిదండ్రులను ఆర్జేడీ నాగమణి, డీఈఓ అన్నపూర్ణ సత్కరించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు, ఎంఈఓ గణేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు పి.పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హెల్దీ కాప్ యాప్' పనితీరుపై అవగాహన

కాకినాడ క్రైం: హెల్దీ కాప్ యాప్ పేరుతో పోలీసుల ఆరోగ్య పరిరక్షణ కొసం ప్రవేశపెట్టడానికి అవకాశం ఉన్న ఓ యాప్ పనితీరుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పాల్గొన్నారు. ప్రైవేటు సంస్థ రూపొందించిన ఈ యాప్‌ను జిల్లా పోలీస్ శాఖ కొనుగోలు చేసి సిబ్బంది ఆరోగ్య పర్యవేక్షణకు వినియోగించే ఆలోచనలో ఉంది. అందులో భాగంగా యాప్ పనితీరు, ప్రయోజనాలపై శనివారం ఏర్పాటు చేసిన జూమ్ కాన్ఫరెన్సులో అవగాహన కల్పించారు. గుంటూరుకు చెందిన నెఫ్రాలజిస్టు డాక్టర్ చింతా రామకృష్ణ యాప్ ప్రయోజనాలను ఎస్పీతో పాటు ఇతర అధికారులకు వివరించారు.

యువకుడి అదృశ్యం



గురజనాపల్లికి చెందిన సానా శ్రీను

కరప: మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కరప ఎస్‌ఐ నాడు రామకృష్ణ కథనం మేరకు గురజనాపల్లి గ్రామానికి చెందిన 32 ఏళ్ల సాదా శ్రీను ఈ ఏడాది జనవరి 16న మధ్యాహ్నం భోజనంచేసి బయటకు వెళ్లాడు. అప్పటినుంచి తిరిగి ఇంటికి రాలేదు. అప్పటినుంచి గురజనాపల్లి పరిసర గ్రామాల్లోను, బంధువులు, స్నేహితులు ఇళ్లల్లోను గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి సానా అమ్మాణి శనివారం కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఇటుకల పరిశ్రమకు తోడ్పాటు



కొమరగిరిలో గృహ నిర్మాణాల ప్రగతిని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

- కార్పొరేషన్ కమిషనర్ రమేష్
- కొమరగిరి లేఅవుట్ సందర్శన

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో కొమరగిరి లే అవుట్‌లో గృహ నిర్మాణాలకు అవసరమైన మేరకు సరఫరా చేసేలా ముందుకు వచ్చే ఇటుకల పరిశ్రమకు పూర్తి తోడ్పాటు అందిస్తామని కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. శనివారం ఆయన ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, కాంట్రాక్టర్లతో కలిసి కొమరగిరి లే అవుట్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తొమ్మిది వేల మందికి పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు అగ్రిమెంట్లు పూర్తిచేశారని, మూడు వేలకు పైగా ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఈ దశలో ఆయా నిర్మాణాలకు అవరోధం లేకుండా అధికారులు స్థానికంగా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇటుకల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చేవారిని ప్రోత్సహించి అక్కడే స్థలాలు కేటాయించడంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక వసతుల కల్పనపై సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏడీసీ నాగనరసింహారావు మాట్లాడుతూ గృహనిర్మాణాలకు ప్రస్తుతం అనువైన సమయమని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. వారి వెంట గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, గృహనిర్మాణాలు చేస్తున్న జేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఇషాన్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

నెలాఖరుకు టిడ్కో ఇళ్ల అప్పగింత



టిడ్కో ఇళ్లను సందర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో కమిషనర్ రమేష్, ఏడీసీ నాగనరసింహారావు, అధికారులు

- అధికారులతో ఎమ్మెల్యే ద్వారంపూడి సమీక్ష

కాకినాడ: మార్చి నెలాఖరుకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధికారులను కోరారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్, వివిధ శాఖల అధికారులతో పర్లోపేట టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించి, మౌలిక వసతుల కల్పన, ఇళ్ల నిర్మాణ ప్రగతి, రుణాల మంజూరు తదితర అంశాలపై సమీక్షించారు. ఇళ్లలో విద్యుదీకరణ, ప్లంబింగ్ తదితర పనులు పరిశీలించి సూచనలిచ్చారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలోనే చెప్పిన విధంగా 2056 ఇళ్లకు మార్చి నెలాఖరు నాటికి 1152 ఇళ్లను తొలి విడతగా అందజేస్తున్నట్టు తెలిపారు. వీరంతా ఏప్రిల్ మొదటి వారంలో కానీ, రెండో వారంలో కానీ గృహప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. రెండో విడత ఇళ్లను ఏప్రిల్ నెలాఖరునాటికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట టీపీఆర్వో మానే కృష్ణమోహన్, టిడ్కో ఈఈ రీటా, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, స్థానిక నాయకులు మట్టపర్తి రఘు, సింగ్, పరశురామ్, సీతారామ్, దిబ్బాడ పెదబాబు తదితరులు ఉన్నారు.

ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

కాకినాడ: కాకినాడ పర్లోపేటలో ముస్లింల శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఆ ప్రాంత ముస్లిం పెద్దల ఆహ్వానం మేరకు శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి పర్లోపేట మసీదును సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్లోపేటలో ఇప్పటి వరకు రూ.64 లక్షల విలువైన అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశామన్నారు. స్థానిక ముస్లిం పెద్దల విజ్ఞప్తి మేరకు ముస్లింల శ్మశానవాటికను చదును చేసి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ప్రభుత్వ క్వాజీ హజరత్‌గౌస్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీద్‌బిన్ వలీ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీం, అజార్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ, ఖోఖో పోటీలు



ఖోఖో, కబడ్డీ పోటీల్లో విజేతలతో కళాశాల సిబ్బంది

నాగమల్లితోట జంక్షన్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అన్నవరం సత్యదేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 60 మంది క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొన్నారు. పోటీల నిర్వహణలో కళాశాల పీడీ ప్రమీల, కోచ్‌లు వెంకటతేజ, గోపి, సెట్రాజ్ సిబ్బంది సహకారం అందించారు. విజేతలకు చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ పతకాలు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల భద్రత కరవు

బోట్‌క్లబ్: అపార్ట్‌మెంట్ నిర్మాణంలో భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరవైందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం పనిచేస్తుండగా మృతి చెందిన కోటిపల్లి నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం అపార్ట్‌మెంట్ వద్ద కుటుంబీకులు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అపార్ట్‌మెంట్ నిర్మాణాల్లో భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువైందన్నారు. కార్మికులకు కనీసం సేఫ్టీ బెల్టులు, హెల్మెట్‌లు, అపార్ట్‌మెంట్ చుట్టూ మెష్‌లు ఏర్పాటు చేయడంలో ఇంజినీర్లు, బిల్డర్లు అలసత్వం వహిస్తున్నారన్నారు. రూ.కోట్లాది రూపాయలతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నా, కనీసం భవన నిర్మాణ కార్మికులకు మంచినీరు, టాయిలెట్ సౌకర్యంగానీ ఏర్పాటు చేయడం లేదన్నారు. ఈ ధర్నాలో మృతుని తండ్రి వెంకట రాము, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి. లోవరత్నం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆనందమీనందమాయె..



కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు శనివారం భారీగా మత్స్య సంపద చిక్కింది. సుమారు రూ.5 లక్ష విలువైన కోనేలు, చందువాలు, రొయ్యలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. అమినాబాద్ శివారు చేపలరేవులో వీటిని కొనేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. ఈ చేపలను తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని వ్యాపారులు తెలిపారు.

మత్స్యకారులకు చిక్కిన చేపలు

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి
- పాల్గొన్న కమిషనర్, మాజీ మేయర్ తదితరులు



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న తదితరులు

కాకినాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హతే ప్రాతిపదిక అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 27వ డివిజన్‌లోని వివేకానందవీధి, పైడావారి వీధి, పూసలవారి వీధి ప్రాంతాల్లో ఆయన శనివారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సాంకేతిక పరమైన ఇబ్బందులతో ఎక్కడైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు రాజాన సూర్యప్రకాష్, ఎస్ఎస్ రాజు, మన్యం బాబి, వరిపల్లి కృష్ణవేణి, చిలుకూరి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న చెప్పారు. స్థానిక త్రిపుర సుందరి ఆలయం సమీపంలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆమె కోరారు.

కరపలో..

కరప: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ రమణయ్యపేటలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన కరపలో మాట్లాడుతూ మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామకమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనసరిగా పాల్గొనాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సాదే లోహిదాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ డివిజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ మాజీ గవర్నర్ ఎం.విశ్వేశ్వరరావు, క్లబ్ అధ్యక్షురాలు టీసీ దేవకీదేవి మాట్లాడుతూ తమ సభ్యురాలు సూర్యకళ సౌజన్యంతో ఈ పంపిణీ చేస్తున్నామన్నారు. క్లబ్ సభ్యులు మీనాక్షి, సునీత, కామరాజు, అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

అపూర్వ సాయం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గోల్డెన్ గ్రూప్‌గా ఏర్పడి తాము చదువుకున్న పాఠశాలకు అపూర్వ సాయం అందించారు. సుమారు రూ.3 లక్షలు వెచ్చించి పాఠశాల స్వాగత ద్వారం, తరగతి గదులకు ఐరన్ గ్రిల్స్, విద్యార్థుల సైకిళ్లకు రక్షణగా సైకిల్ స్టాండ్ నిర్మించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న చదువుల తల్లి సరస్వతి, పాఠశాల స్థల దాత నామన వెంకాయమ్మ విగ్రహాలకు రక్షణగా పైన గొడుగులు ఏర్పాటు చేశారు. జీవితంలో తాము ఉన్నతంగా స్థిరపడేందుకు కారణమైన తమ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా ఆయా సేవా కార్యక్రమాలు చేసినట్లు పూర్వ విద్యార్థులు అయితంపూడి శ్రీనివాస్, దుప్పి సత్యన్నారాయణ తదితరులు తెలిపారు.

14న జనసేన ఆవిర్భావ సభ

కరప: జనసేన ఆవిర్భావ దినోత్సవసభను ఈ నెల 14 నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి కోరారు. నడకుదురులో శనివారం జరిగిన మండలపార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముసాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కలశాలు, సారె పట్టుకుని ఊరేగింపుగా వెళ్తున్న కరప గ్రామ మహిళలు



వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి



ముసాలమ్మతల్లికి కరప గ్రామస్తులు సమర్పించిన సారె

కరప: వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామదేవత పుట్టింటివారైన పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. వేములవాడ, పరిసర గ్రామాలవారు అధికసంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. పుణ్యమంతుల సత్యనారాయణ, ఆలయకమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్నసంతర్పణ చేశారు.

కరప గ్రామదేవత తరపున సారె..

ఈ సందర్భంగా ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్ దంపతులు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, కరప ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కరపకు చెందిన 500 మంది మహిళలు కలశాలు పట్టుకుని, వివిధరకాల స్వీట్లు, పండ్లు, సారె తొట్టెరిక్షాలో ఉంచి, బాలికల కోలాటం, డోలుసన్నాయితో ఊరేగింపుగా మూడుకిలోమీటర్లు పాదయాత్రచేసి వేములవాడలోని ముసాలమ్మ ఆలయానికి వెళ్లి కలశాలను, సారెను ఉంచి ప్రత్యేకపూజలు చేశారు. గ్రామసర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్‌దంపతులు, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, పుణ్యమంతుల సత్యనారాయణ, ఆలయకమిటీ సభ్యులు కరప నుంచి సారె తీసుకొచ్చిన మహిళలకు స్వాగతం పలికి, ప్రసాద వితరణ చేశారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బోట్‌క్లబ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ పెట్టుబడుదారుల ప్రయోజనాలు నెరవేస్తున్నారని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు అన్నారు. సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశం శనివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగింది. కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని విమర్శించారు. లేబర్‌కోడ్‌ల రద్దు కోసం ప్రభుత్వరంగ సంస్థల రక్షణకు కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. ఏప్రియల్ 16 నుంచి 18 వరకూ తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహా సభలు విజయవంతం చేయాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల 26న రాజమహేంద్రవరంలో జిల్లా మహాసభ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారించాలని, కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని, ప్రమాదాలకు కారణమైన యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కె.జోజి, జిల్లా కార్యవర్గ సభ్యులు దేపాటి సత్యనారాయణ, మరుకుర్తి శ్రీను, బంగారు సత్యనారాయణ, డి.శ్రీనివాస్, ఎం భైరవస్వామి పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడిగా నారాయణమూర్తి



సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) అధ్యక్ష, కార్యదర్శులుగా డి. నారాయణమూర్తి, కుంచే అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శనివారం ఏఐఎఫ్‌టీయూ సమావేశం నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ పిఠాపురం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గంలో అన్ని కార్మిక సంఘాల సభ్యులు, కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని సంఘ నాయకులు తెలిపారు. ఈ నెల 21న రాజమహేంద్రవరంలో నిర్వహించే మోతా వెంకటరావు వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు కె.సతీష్, బి.ఏసుబాబు, నూతన కమిటీ సభ్యులు మొగలి కనక మహాలక్ష్మి, యువరాజు, పి.రాయుడు, తోట చంద్రరావు, పిల్లా ఏసుబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- విరాళాలు, టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3.42 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూగా పిలువబడే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి, అనంతరం భక్తులకు ఆశీర్వచనం చేశారు. భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు 3,42,173 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. అనంతరం నిర్వహించిన ఉచిత పులిహోర ప్రసాదంతో పాటు అన్నదానంలో భక్తులు క్యూకట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా సుమారు పదివేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.